# దోపిడీ!

ఆకుండి నారాయణమూర్తి



"ఫాదర్ సీరియస్. స్టార్ట్ ఇమీడియట్లీ!" అని టెలిగ్రాం వచ్చింది.

మురళి గుండె గుభేలుమంది. దడదడ కొట్టుకోసాగింది.

తనప్పుడు 'మక్కువ' నుండి, గజపతినగరం దగ్గరున్న 'పురిటిపెంట' అనే గ్రామానికి వెళ్ళాలి! టైము చూసేడు. రాత్రి తొమ్మిదిగంటలు!....

మురళి ఆ గ్రామ బ్యాంకులో క్యాషియర్‌గా జాయినయి సుమారు నెల రోజులు కావస్తోంది. ఆ వూళ్ళో అతనికి చెప్పుకోదగ్గ స్నేహితులెవ్వరూ యింకా ఏర్పడలేదు!

ఆ రాత్రివేళప్పుడు మక్కువనుండి ఎక్కడికెళ్ళడానికి ప్రయాణసాధనమేదీ లేదన్న సంగతి మురళికి తెలుసు.

తను పనిచేస్తున్న బ్యాంక్ మేనేజరుగారింటికెళ్ళి, అతనిని నిద్రలేపి, వైరు చూపించి, "నన్నిప్పుడెవరైనా స్కూటరుమీద సాలూరుగాని, చినబోగిలిగాని దిగబెట్టగలిగితే; అక్కడనుండి గజపతినగరంకేసి వెళ్ళే లారీ ఏదైనా నాకు దొరకవచ్చు!....గజపతి నగరానికి పురిటిపెంట ఎంతో దూరం లేదుగనుక, అక్కడ నుండి నడచి వెళ్ళిపోతాను." అని మురళి రుద్ధకంఠంతో అన్నాడు.

బ్యాంకు మేనేజరుగారు కొంచెంసేపాలోచించి, షర్టు తొడుక్కొని, ఆ గ్రామంలో స్కూటరున్న వీర్రాజుగారింటికి మురళిని తీసుకెళ్ళి - తామప్పుడెందు కొచ్చినదీ విశదీకరించి చెప్పారు.

కన్నీళ్ళొత్తుకుంటున్న మురళికేసి చూసేసరికి వీర్రాజుగారికి జాలేసింది!.... "మీరేం ఆందోళన చెందకండి. మిమ్మల్నిప్పుడు సాలూరో, చినబోగిలో స్కూటరు మీద దిగబెట్టించే ఏర్పాటు చేస్తాను." అని కొంచెంసేపాగి, సిగరెట్ ముట్టించి, ఖర్ర గోక్కుంటూ, "సాలూరో, చినబోగిలో మిమ్మల్నిప్పుడు దిగబెట్టించేకంటే, రామభద్రపురం జంక్షన్‌కి దిగబెట్టించడం శ్రేయస్కరం. ఎందుకంటే; అక్కడి నుండి గజపతినగరంకేసి వెళ్ళే వెహికిల్సు ఏవైనా మీకు గ్యారంటీగా దొరుకుతాయి!" అని అన్నారు.

అతనట్లా అంటున్నప్పుడు అతని చిన్నకొడుకు 'శ్రీను' అక్కడే వున్నాడు.

"నాన్నగారూ! ...అయితే నేనిప్పుడతన్ని మన స్కూటరుమీద రామభద్రపురం జంక్షన్‌కి దిగపెట్టేసేదా?" అనడిగేడు శ్రీను.

"అటునుండి ఈ రాత్రివేళ నువ్వొక్కడివీ తిరిగి రాగలవా?" అనడిగేడు వీర్రాజుగారు.

"రావడానికి భయమేస్తే, రామభద్రపురంలో బాబయ్యగారింట్లో వుండిపోయి, తెల్లారేక వస్తాను." అని సమాధానమిచ్చేడు శ్రీను.

"చూడు ....రామభద్రపురంలో ఇతనికి వెంటనే ఏ వెహికిలూ దొరక్కపోతే, మన స్కూటరుమీదే యితనిని పురిటిపెంట దిగబెట్టెయ్యి!" అని వీర్రాజుగారనేసరికి, మురళి హృదయం కృతజ్ఞతతో స్పందించింది.

బ్యాంక్ మేనేజర్, వీర్రాజుగారికి కృతజ్ఞతాభివందనాలు తెలియజేసేరు!...

* * *

ఎందుకయినా మంచిదని; మురళి ఓ రెండు జతల బట్టలు, లుంగీ, తువ్వాలు, ఓ వెయ్యి రూపాయలు పట్టుకున్నాడు!

శ్రీను స్కూటరు స్టార్ట్‌చేసి, మురళికేసి చూస్తూ, కూర్చోమన్నాడు. మురళి కూర్చున్నాడు.

కాస్త కైపుమీదున్నందువల్ల, తానెంత స్పీడుగా స్కూటర్ని డ్రైవ్ చేస్తున్నదీ శ్రీను గమనించలేదు!

మురళి గుండె స్పీడుగా కొట్టుకోసాగింది.

ఏవిటా స్పీడు?...పోనీ టర్నింగ్సులోనైనా స్పీడు తగ్గించొచ్చుగా!... కర్మకాలి యాక్సిడెంటయితే?...ఉభయులకీ ప్రమాదమే!...

స్పీడు తగ్గించమని చెప్పుదామనుకున్నాడు మురళి. కాని అతడేమను కుంటాడోనని భయమేసి నోరు మూసుకున్నాడు!

"మీ నాన్నగారి వయస్సెంత?" అనడిగేడు శ్రీను.

"ఏభై అయిదు." అని సమాధానమిచ్చాడు మురళి.

"ఏదైనా ఉద్యోగం చేస్తున్నారా?"

"ఊఁ!"

"ఏఁవిట్లా ఉద్యోగం?"

"గజపతినగరం జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. గజపతినగరంలో ఎక్కడా ఇల్లు అద్దెకు దొరక్కపోవడంచేత, ఆక్కడికి దగ్గరగా వున్న "పురిటిపెంట" అనే గ్రామంలో ఇల్లు అద్దెకు తీసుకొని, రోజూ టి.వి యస్ ఫిఫ్టీ మీద గజపతినగరం వచ్చి వెళుతున్నారు."

"మీ నాన్నగారికి ఇంతకుముందేదయినా జబ్బుందా?

"లేదు!" అని సమాధానమిచ్చేడు మురళి.

"మనిషి కాస్త లావుగా వుంటారా?"

"ఊఁ!"

"అయితే హార్టు అటాక్ వచ్చుంటుంది!" అని ఓ ప్రముఖ వైద్యుడిలాగ శ్రీను అనేసరికి - మురళికి గుండె ఝల్లుమంది. దడదడమని అతని గుండె స్పీడుగా కొట్టుకోసాగింది!...

బాధగా నిట్టూర్చి, "ఏమో!...ఏం జబ్బొచ్చిందో?...నాకు చాలా భయంగా వుంది!" అని అన్నాడు మురళి.

"మీకు తమ్ముళ్ళున్నారా?" అనడిగేడు శ్రీను.

"ఊఁ!" అని మూలిగేడు మురళి.

"ఎందరు?"

"ఇద్దరు."

"చదువుకున్నారా?"

"పెద్ద తమ్ముడు బి.ఏ. పాసయాడు. నిరుద్యోగి!...చిన్న తమ్ముడు ఇంటర్ చదువుతున్నాడు."

"చూడండి మురళిగారూ!....మీరేం ఆందోళన చెందకండి! ఒకవేళ దురదృష్టవశాత్తూ మీ నాన్నగారు చనిపోయారే అనుకోండి! మరేం ఫరవాలేదు!... ప్రభుత్వోద్యోగం చేస్తూ చనిపోయినవారి సంతానంలో ఒకనికి, ఏలినవారు సానుభూతితో ఉద్యోగమిస్తారు! కనుక మీ నాన్నగారొకవేళ చనిపోయినట్లయితే, పెద్ద తమ్ముడికి ఏదో ఒక ఉద్యోగం ఏలినవారిస్తారు!" అని శ్రీను అనేసరికి, మురళికి ఒళ్ళు మండింది!....ఏఁవిటీ ఓఘాయిత్యపు మాటలు?....తాగిన మైకంలో అంటున్న మాటలా?...లేక అతని మాటలతీరే అంతా?...

తానప్పుడు ఏఁవీ అనలేని పరిస్థితి!... అవసరం తనది! తనెట్లా అయినా ఆ రాత్రి పురిటిపెంట చేరాలి. తనను పురిటిపెంట చేర్చేటందుకు గాను శ్రీను పూనుకున్నాడు!...కనుక అతడెంత అప్రియంగా మాట్లాడినా, తను నోరుమూసుకోక తప్పదనుకున్నాడు మురళి.

"రామభద్రపురం జంక్షన్‌లో, గజపతినగరంకేసి వెళ్ళే వెహికల్ ఏదైనా మీకు వెంటనే దొరికితే ఫరవాలేదు! లేదా ఇంతకు రెట్టింపు స్పీడుతో మిమ్మల్ని స్కూటరుమీద పురిటిపెంట గ్రామానికి తీసుకెళ్తాను!" అని శ్రీను అనేసరికి, మురళి గుండె ఆగినంత పనయింది!...కాని ఆగలేదు:

ఇంతకు రెట్టింపు స్పీడా?...అమ్మబాబోయ్!...ఇంకేమయినా వుందా?.... అసలు రామభద్రపురం జంక్షన్‌కేయినా తననితడు సవ్యంగా తీసుకెళతాడా? ఆ స్పీడు చూస్తే ఏ టర్నింగ్‌లోనయినా యాక్సిడెంటయేటందుకవకాశముంది!... స్కూటర్ యాక్సిడెంట్సులో స్కూటర్ని నడుపుతున్న వ్యక్తికి తగిలిన దెబ్బల కంటే, వెనకాల కూర్చున్న వ్యక్తికే ప్రాణాపాయకరమయిన పెద్ద దెబ్బలు తగులుతూంటాయి!...

అప్పుడు యాక్సిడెంటయితే...?

తనకు తీవ్రమైన గాయాలు తగులుతే....?

ఒకవేళ తానాయాక్సిడెంటులో మరణిస్తే...?

ఈ విషాదవార్త, సీరియస్ కండిషన్‌లో వున్న తన తండ్రికి, తన ఆత్మీయులకు తెలుస్తే?...

అట్లా ఆలోచించడానికే భయమేసింది మురళికి.

"మీరిప్పుడు ఎంత స్పీడులో స్కూటర్ని డ్రైవ్ చేస్తున్నారో తెలుసా?" అని కాస్త సంశయిస్తూనే అడిగేడు మురళి.

"ఎదురుగా అడ్డేపీ లేకపోతే నా స్పీడుకు అడ్డుండదు!...అయినా ఈ యుగలక్షణం స్పీడ్!...తగినంత స్పీడును మెంటైన్ చెయ్యకపోతే వెనకబడి పోతాం!....అదీకాక మీ ఫాదర్ కండిషన్ సీరియస్‌గా వుందని వైరొచ్చింది. వీలయినంత వేగంగా తండ్రిని చూడాలనే ఆతృత మీకుంటుందని నాకు తెలుసు! రోడ్డు బాగులేదు. బాగుండేనా?....ఈసరికి మిమ్మల్ని రామభద్రపురం జంక్షన్‌కి తీసుకుపోయుండేవాడిని!" అని శ్రీననేసరికి ఇహ ఏమనాలో మురళికవగతం కాలేదు.



"హే భగవాన్!....ఇహ నువ్వే దిక్కు!" అని భగవంతుడికి మనసులో మ్రొక్కి, ప్రాణాల్ని బిగబట్టుకొని, గుండె దిటవు చేసుకొని స్కూటరుపై కూర్చున్నాడు మురళి.

★ ★ ★

ఎట్లా అయితేనేం ఎట్టి ప్రమాదానికి లోనుకాకుండా ఆ ఉభయులు రామభద్రపురం జంక్షన్‌కి చేరుకున్నారు.

బొబ్బిలివైపునుంచి వస్తున్న ఓ కారుకి, తన స్కూటర్ని కాస్త అడ్డుగా నిలిపి, చేత్తో పోకెట్ రుమాల్ని వూపసాగేడు శ్రీను.

డ్రైవర్ కారుని ఆపి, కిటికీలోంచి చాలా చిరాగ్గా చూస్తూ, "ఎందుకు నీదు స్కూటర్ని రోడ్కి అడ్డుగా నిలిపి, కార్కి ఆపేవు?" అనడిగేడు అదోరకమైన యాసతో!

మురళిని చేత్తో చూపిస్తూ, "ఇతని ఫాదర్‌కి చాలా సీరియస్‌గా వుందని వైరొచ్చింది. గజపతినగరం దగ్గరున్న ఓ విలేజ్ వెళ్లాల్సుంది ఇతను. మీ కారులో గజపతినగరం వరకు లిఫ్ట్ ఇవ్వమని నా రిక్వెస్టు!" అని ఎంతో సౌమ్యంగా బ్రతిమాలేడు శ్రీను.

ఆ కారు డ్రైవర్ వెనక్కు తిరిగి, వెనుక సీట్లో కూర్చున్నవాళ్ళతో ఏదో భాషలో మెల్లగా చెప్పేడా సంగతి.

వాళ్ళు సమ్మతించేరు కాబోలు!...డ్రైవర్ ఎడంప్రక్కకు వంగి, ఫ్రంటు సీటు డోర్ తెరచి, ఎక్కి కూర్చోమని సైగ చేసేడు!

మురళి కారెక్కి ఫ్రంట్‌సీట్లో కూర్చున్నాక, వెనుకసీట్లో ఎడంచేతిప్రక్క కూర్చున్నవ్యక్తి ఫ్రంటుసీటు డోర్ క్లోజ్ చెయ్యడం, డ్రైవర్ కారు స్టార్టు చెయ్యడం క్షణాలమీద జరిగిపోయేయి!....

శ్రీనుకి థ్యాంక్స్ చెప్పేటందుకైనా మురళికి వ్యవధి నివ్వలేదా డ్రైవర్

వెనుకసీట్లో కూర్చున్నవాళ్ళు మాట్లాడుకుంటున్న భాషనుబట్టి, వాళ్ళెవ్వరూ తెలుగువాళ్ళు కారని గ్రహించేడు మురళి!

డ్రైవర్ ఎందుకో ఓసారి కారులోని లైటును వెలిగించి, మళ్ళీ టప్‌మని ఆర్పేశాడు. ఆ సమయంలో మురళి వెనక్కు తిరిగి చూసేడు. వాళ్ళతని కళ్ళకు బందిపోటు దొంగల్లా కనిపించేరు!....

వెనుకసీట్లో మధ్యని కూర్చున్న వ్యక్తి, మురళి నుద్దేశించి, "నీకు ఫాదర్కి సీరియస్సా?" అనడిగేడు అదోరకమైన యాసతో!

వాళ్ళకి కాస్త తెలుగుభాష కూడా వచ్చని మురళి గ్రహించి, "అవును." అని సమాధానమిచ్చేడు.

"నీదు ఫాదర్కి యేజ్‌కి ఎంత?" అనడిగేడు.

"ఫిఫ్టీఫైవ్." అని సమాధానమిచ్చేడు మురళి.

"ఏమిటి డిసీజ్?" అనడిగేడు కుడిప్రక్క కూర్చున్న వ్యక్తి.

"తెలీదు!" అని సమాధానమిచ్చేడు మురళి.

"మీ ఫాదర్ ప్రోపర్టీ ఏమయినా ఎర్న్ చేసేడా?"

"ఏమీలేదు!" అని భయపడుతూ గద్గదికమవుతున్న గొంతుకను సవరించుకొని సమాధానమిచ్చేడు మురళి.

"మీ ఫాదర్కి డిసీజ్‌కి ట్రీట్ చేయించాలంటే మనీ సఫిషెంటుగా వుండాలి కదా?!...ఇప్పుడు ఎంత మనీ నీ దగ్గరుంది?" అనడిగేడు ఎడంచేతి ప్రక్క కూర్చున్న వ్యక్తి.

"ఏదో దారిఖర్చులకు సరిపోయేటంత!" అని సమాధానమిచ్చేడేగాని అతని గుండె భీతితో దడదడ కొట్టుకోసాగింది!

వాళ్ళ వేషాలు, ఆకారాలు, మాట్లాడే ధోరణి చూస్తూంటే వాళ్ళంతా దొంగలముఠాకు చెందినవాళ్ళే అయుంటారనే అనుమానం మరింత దృఢపడింది మురళికి!

తన దగ్గరున్న వెయ్యి రూపాయల్ని వాళ్ళు దోచుకొని, తనను ఆ కారులోంచి క్రిందకు తోసేస్తే తనేం చెయ్యగలడు?

మళ్ళీ భయం!...తీవ్రంగా గుండెదడ!!

అసలు తన తండ్రికెట్లా వుందో?

ఇంతకి తనారాత్రి తన తండ్రిని చూడగలడా?

తనప్పుడు ప్రయాణం చేస్తున్న కారు; బందిపోటు దొంగల కారే అయి, వాళ్ళు తనను దోచుకొని, కారులోంచి తనను క్రిందకు తోసేస్తే, తను తీవ్రంగా గాయపడడమో, చావడమో ఖాయం!...

కొన్ని మాసాలక్రితం విజయనగరానికి, గజపతి నగరానికి మధ్య - ఓ బస్సుని, ఓ లారీని దొంగలు దోచుకున్నట్లు తను న్యూస్‌పేపర్లో చదివేడు!

ఆ కారులో వున్నవాళ్లు దొంగలముఠాకు చెందినవాళ్లేమో!

దోపిడీకే బయలుదేరేరేమో!

దొంగలెవరో, దొరలెవరో పోల్చుకోలేని రోజులివి!

డబ్బుకోసం ఎంతటి దారుణానికైనా ఒడిగట్టేటందుకు సంశయించని దుర్మార్గుల సంఖ్య నానాటికీ పెరిగిపోతోందీ లోకంలో!

వాళ్ళు తనవద్దగల వెయ్యి రూపాయల్ని తీసుకొని, తనను ఆ కారులోంచి కిందకు త్రోసివేస్తారేమోననే భీతితో మురళి గడగడ వణికిపోసాగేడు!...

"హే వీరహనుమాన్!...ఇహ నువ్వే నాకు దిక్కు!" అని మనస్సులో మ్రొక్కుకొని, "హనుమ....హనుమ....హనుమ...." అని హనుమంతుడి నామాన్ని జపించసాగేడు మురళి!

అత్యధికమైన భయమేసినప్పుడు హనుమంతుడి నామాన్ని జపించడం అతనికలవాటు!....

మానసికమైన అతని హనుమన్నామ జపానికి; వెనుకసీట్లో సీసాలమూతలు వూడబీకిన చప్పుడు విఘాతం కల్గించింది!....

మురళి వెనక్కు తిరిగి చూసేడు.

వాళ్ళ చేతుల్లో మందుబుడ్లీలు!

"ఆర్ యు హేబిట్యువేటెడ్?" అని ఎడమప్రక్క కూర్చున్న వ్యక్తి మురళినడిగేడు.

"నో సర్!...." అని సవినయంగా సమాధానమిచ్చేడు మురళి.

గుటకలేస్తున్న చప్పుడు!....త్రాగుతూ ఏదో నములుటున్నారు! గరమ్ మసాలా వాసన!....

నిషా బాగా తలకెక్కాక తన పని పడతారేమో!

గుండెలో స్పందన మరింత తీవ్రతరమయింది.

ఎదురుగా ఎలక్ట్రిక్ లైట్లు అగుపించేయి మురళికి. బహుశా అది గజపతి నగరమే అయుంటుదనుకున్నాడు.

అయిదు నిముషాలు గడిచేయి. అది గజపతి నగరమే!

డ్రైవర్ కారాపేడు.

మురళి డోర్ తెరచి క్రిందకు దిగి, మళ్ళీ డోర్ క్లోజ్ చేసేశాడు.

ఆ కారు వెనుకసీట్లో ఎడంప్రక్క కూర్చున్న వ్యక్తి, మురళిని దగ్గరకు

పిలచి, "ఇక్కడిక్కి మీ విలేజ్ ఎంత డిస్టెన్సులో వుంటది?" అనడిగేడు.

"దగ్గరే సార్." అని సమాధానమిచ్చేడు మురళి.

"ఈ గజపత్‌నగర్‌లో మంచి ఎఫిషెంట్ డాక్టరుండాడా?"

"ఉన్నారు!"

"ఇదుగో నిన్నుజూస్తే నాకు "పిటీ"; ఐమీన్ జాలి కల్గుతోంది....రీజన్ ఏమ్టోదెల్సా?"

తెలీదన్నట్లు బుర్ర అడ్డంగా ఆడించేడు మురళి....

"ట్వెంటీ ఇయ్యర్సుబేక్, ఇప్పు నీకు వైరొచ్చినట్టుగానే నాకూ ఓ వైర్ వచ్చింది; మా ఫాదర్కి సీరియస్సని....అది నైట్‌టైమ్....ఎవురూ నాకు లిఫ్ట్ ఇవ్వలేదు. ఎంతో శ్రమకు లోనై అతి కష్టంమీద నేను మా వూరెళ్ళేసరికి మా ఫాదర్కి కండిషన్ వెరీ బేడ్‌గా వుంది! ఫాదర్ని డాక్టర్ దగ్గర్కి తీస్కెళ్ళ డాన్కి మనీలేదు....మనీ లేకపోవడంవల్లే మా ఫాదర్ ఆనాడు చచ్చిపోనాడు! ఆనాడు నేను ఫేస్‌జేసిన సిట్యుయేషన్ నువ్విప్పుడు ఫేస్ జెయ్యకూడదు....ఈ వన్‌థౌజెండ్ రుపీస్ నీ దగ్గరుంచు!" అని ఓ పది వందరూపాయల నోట్లను మురళి జేబులోకి కుక్కి, "స్పెండ్ ద రిక్వైర్డు ఎమౌంట్ అండ్ గివ్‌హిమ్ గుడ్ ట్రీట్‌మెంట్ బై యాన్ ఎఫిషెంట్ డాక్టర్....జావ్ బేటా జావ్" అని అన్నాడు.

మురళి నేత్రాలు కృతజ్ఞతతో ఆర్ద్రమయినాయి.

"మరి యీ వెయ్యి రూపాయిల్ని, మీకు తిరిగి నేను అప్పు తీర్చాలంటే మరి మీ అడ్రస్సు...." అని మురళి అతని అడ్రస్సు అడగబోతూండగా,

"జావ్ బేటా జావ్!....తౌజెండ్ రుపీస్ మాకో పెద్ద ఎమౌంట్ కాదు. వన్‌మినిట్‌లో స్పెండ్ చెయ్యగలం. వన్‌మినిట్‌లో సంపాదించాగలం. జావ్....జల్దీ....అరె శ్యామ్! స్టార్ట్!" అనేసరికి కారు ర్యయ్‌మని ముందుకు దూసుకుపోసాగింది....

మురళి నిశ్చేష్టుడై, ఆ కారు వెనకాలగల ఎర్రని డేంజరులైటు కనుమరుగయేటంతవరకు చూసి - తమ గ్రామంకేసి బయలుదేరేడు.

★ ★ ★

మురళి ఇంటికెళ్లేసరికి తన తండ్రితో కలిసి పనిచేస్తున్న కో లెక్చరర్సులో చాలామంది అక్కడే వున్నారు.


టి.వి.యస్. ఫిఫ్టీ మీద వెళుతున్నప్పుడు తన తండ్రి పడిపోయేడని— ఆదే సమయంలో ఓ నాటుబండీ అతనిమీదనుండి వెళ్ళిపోయిందని - గజపతినగరంనుండి డాక్టరుగారొచ్చి - ప్రక్కటెముకలు ఫ్రాక్చరయినాయని - అంచేత వైజాగ్ తీసుకెళ్ళి చికిత్స చేయించడం శ్రేయస్కరమని సలహా ఇచ్చి-ప్రథమ చికిత్సచేసి - తాత్కాలికంగా నొప్పి తగ్గేటందుకు, నిద్రపట్టేటందుకు ఇంజెక్షన్లు ఇచ్చినట్లు అక్కడున్నవాళ్ళు చెప్పగా మురళి తెలుసుకున్నాడు, అంబులెన్సు కోసం ఫోను చేసినట్లు, వచ్చిన వెంటనే వైజాగ్ తీసుకెళ్ళాల్సుందని వాళ్ళు చెప్పేరు.

మరో పావుగంటలో అంబులెన్సు వచ్చింది.

★ ★ ★

తన తండ్రికి సక్రమంగా, సవ్యంతంగా చికిత్స చేసేటందుకు; అచ్చట డాక్టర్లతోపాటు తదితర సిబ్బంది కూడా తననెట్లా దోచుకున్నదీ మురళి స్వానుభవంతో తెల్సుకున్నాడు!....

రెండురోజులు గడిచేసరికి మురళి జేబులో రెండు రూపాయలు మాత్రమే మిగిలేయి ...డబ్బు తేవాలంటే తను తమ వూరికెళ్ళాలి. తమ వూరికెళ్లేటందు




కయినా సరిపోయేటంత సొమ్ము తన దగ్గర లేదు....ఏం చెయ్యడమా అని ఆలోచిస్తూ వార్డులో కూర్చున్నాడు మురళి....

ఆ వార్డులో ప్రక్క బెడ్‌పై వున్న పేషెంటుకి ఎటెండెంటుగా ఉందామని వచ్చిన వ్యక్తి ఓ న్యూస్‌పేపరు పట్టుకొచ్చేడు. ఆతడా న్యూస్‌పేపర్ని చదవడం పూర్తిచేసేక - ఆ న్యూస్‌పేపర్ని తనకు చదివేటందుకివ్వమని అతడిని అర్థించేడు. మురళి.

అతడా న్యూస్‌పేపర్ని మురళికిచ్చాడు.

ఆ న్యూస్‌పేపర్లో మొదటిపేజీలో ప్రముఖంగా కనిపించిన ఓ వార్తను చదివి నిర్ఘాంతపోయేడు మురళి...."రెండోతేదీ రాత్రి గజపతినగరం, విజయనగరముల మధ్య ఓ చెరువువద్ద, నవరంగపూర్‌కేసి పోతున్న బస్సుని ఆపి, కండక్టర్‌వద్ద గల సొమ్మునేకాక, ప్రయాణీకుల వద్ద గల సొమ్మును, ఆభరణాలను, విలువైన వస్తువులను దోచుకొని, బస్సు టైర్లు కోసేసి దొంగలు తమ కారులో స్పీడుగా వెళ్ళిపోయేరు. వారివద్ద పిస్టల్సు వున్నాయి. ఆ దొంగలకు హిందీ, ఒరియా, ఇంగ్లీషు, తెలుగు భాషలు వచ్చునని ప్రయాణీకులు చెప్పేరు. వారు మధ్యప్రదేశ్‌కి చెందిన బందిపోటు దొంగలముఠాకు చెందినవారయి వుండవచ్చని ఊహిస్తున్నారు....ఆ దొంగల్ని పట్టుకొనేటందుకు పోలీసువారు రంగంలోకి దూకేరు ..." ఇదీ ఆ వార్తయొక్క సారాంశం!

తనను కారులో గజపతినగరం వరకు తీసుకొచ్చి, తనకు వెయ్యి రూపాయల్ని యిచ్చినవారే ఆనాటిబస్సుని దోచుకున్న దొంగలా?....కానూవచ్చు. కాకపోనూ వచ్చు...వాళ్లు దొంగలే అయితే తనకెందుకంత ఉదారంగా సహాయం చేసేరు?....దొంగలు కూడా మనుషులే....కొన్ని సందర్భాలలో వాళ్ళలో కూడా నిద్రాణమై వుండే మానవత్వం జాగృతం కావచ్చనుకున్నాడు మురళి....

ప్రముఖ ఆసుపత్రిలో వున్న తన తండ్రికి, సకాలంలో తగిన వైద్యచికిత్స చేసేటందుకై ఆనాడు ఆస్పత్రిలో వున్న డాక్టర్లు, వారి సిబ్బంది తనను నిర్దయగా దోచుకున్నారు! ఇట్లా ఎంతకాలంనుండి ఎంతమందిని దోచుకుంటున్నారో? ఈ రకమైన దోపిడీకంటే, ఆనాటి బస్సు దోపిడీ ఘోరమైనదా?....అని చాలాసేపు ఆలోచించాడు మురళి!....కాని ఖచ్చితమైన నిర్ణయానికి రాలేకపోయాడు మురళి!

మురళి తల్లి గ్లూకోజ్ పట్టుకొని వచ్చింది.

"అమ్మా! తీసుకొచ్చిన డబ్బంతా ఖర్చయిపోయింది." రెండురూపాయలు మాత్రమే నా దగ్గర మిగిలేయి!" అని తల్లికి చెప్పేడు బాధగా నిట్టూర్చుతూ.

తన వుస్తెలతాడుకేసి చూస్తూ, "ఇదుందిగా!....ఇది కూడా ఖర్చయిపోయేక ఏం చెయ్యడమో ఆలోచించవచ్చు." అనంటె దుఃఖాన్ని దిగమింగుకుంటూ!...ఆమె అట్లా అనేసరికి మురళి నేత్రాలు అశ్రుపూరితమయినాయి!